క్లుప్తంగా...

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌తో రాణిస్తున్న మహిళలు



శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడుతున్న కార్తీకరెడ్డి

లాలాపేట: అటల్ బిహారీ వాజ్‌పేయీ ఫౌండేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో అందిస్తున్న శిక్షణతో మహిళలు రాణిస్తున్నారని మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి అన్నారు. తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రోత్సాహంతో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను శనివారం కార్తీకరెడ్డి సందర్శించి కుట్టు శిక్షణ, ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్, బ్యూటీషియన్ తదితర వృత్తి విద్యల్లో శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

ప్రశాంతంగా టీఎస్ ఈ-సెట్

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌ఈసెట్-2023 ప్రశాంతగా ముగిసినట్టు కన్వీనర్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ తెలిపారు. శనివారం ఏపీ, తెలంగాణతో పాటు హైదరాబాద్‌లో జరిగిన 91 పరీక్షా కేంద్రాలలో 22454 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని 15 రోజుల్లో ఫలితాలను ప్రకటించనున్నట్లు వెల్లడించారు.

రేపటి నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు

రసూల్‌పురా: సికింద్రాబాద్ జింఖానా మైదానంలో రేపటి (మే 22) నుంచి 18 క్రీడాంశాల్లో సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సుధాకర్ తెలిపారు. శనివారం జింఖానా మైదానంలో వివిధ క్రీడలకు సంబంధించిన కోచ్‌లతో సమావేశమై కీలక అంశాలపై చర్చించారు. నగరంలోని పదహారు మండలాల పరిధిలోని వివిధ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మంత్రులు శ్రీనివాస్ గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్. శాట్స్ చైర్మన్ అంజనేయులు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. జింఖానా మైదానంలో బాలుర, బాలికల అథ్లెటిక్స్ ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, వెయిట్ లిఫ్టింగ్, ఎల్‌బీ స్టేడియంలో బాడ్మింటన్, బాక్సింగ్, స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్ లాన్ టెన్నిస్, టెబుల్ టెన్నిస్, కేవీబీఆర్ ఇండోర్ స్టేడియంలో రెజ్లింగ్, నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆర్చరీ పోటీలు ఉంటాయన్నారు.

పెండింగ్ పనులకు నిధులివ్వండి



వినతి పత్రం ఇస్తున్న లాస్య నందిత, నివేదిత

కంటోన్మెంట్: దివంగత ఎమ్మెల్యే సాయన్న హామీ ఇచ్చి పెండింగ్‌లో ఉన్న పనులను సత్వరమే చేపట్టాలని ఆయన కుమార్తెలు లాస్య నందిత, నివేదిత శనివారం జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని కలిసి మోండా డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన వివిధ పనులతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈస్ట్ మారేడుపల్లి వడ్డెర బస్తీ, లోహియా నగర్‌లో కమ్యూనిటీ హాల్, ఎరుకల బస్తీలో సీసీ రోడ్డు, నెహ్రూనగర్ పార్కులో ఓపెన్ జిమ్, రెజిమెంటల్ బజార్ మనోహర్ థియేటర్ ఎదురుగా రోడ్డు, షెనాయ్ ప్లే గ్రౌండ్‌లో బోర్‌వెల్, టాయిలెట్ తదితర పనుల జాబితాను జోనల్ కమిషనర్‌కు అందజేశారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతి ఇచ్చిన వారిలో జీహెచ్‌ఎంసీ మాజీ కో-ఆప్షన్ మెంబర్ నర్సింహ ముదిరాజ్, పనస సంతోష్, సదానంద్ గౌడ్, అజయ్, మల్లేష్, రమేశ్ ఉన్నారు.

క్రైం కార్నర్..

మహిళ అదృశ్యం



కవిత

రాంగోపాల్‌పేట్: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. నేపాల్‌కు చెందిన జగత్ బహదూర్, కవిత (28) 12 ఏళ్ల క్రితం ఉపాధి కోసం నగరానికి వచ్చి ప్యారడైజ్ ప్రాంతంలో ఉంటున్నారు. జగత్ బహదూర్ సెక్యూరిటీగార్డుగా పనిచేస్తుండగా, కవిత ఇళ్లలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 9న భార్యాభర్తల మధ్య స్వల్ప వివాదం జరిగింది. రాత్రి భోజనం అనంతరం నిద్రకు ఉపక్రమించారు. మధ్య రాత్రి లేచి చూసే సరికి భార్య కనిపించలేదు. బంధువులు, తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సమస్యల పరిష్కారాల నిలయాలు.. వార్డు కార్యాలయాలు



గొల్ల కొమురయ్య కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేయనున్న బన్సీలాల్‌పేట్ వార్డు కార్యాలయం

పాలన వికేంద్రీకరణ లక్ష్యంగా ముందుకు..

- కమ్యూనిటీహాళ్లలో ఏర్పాట్లు
- వేగంగా నిర్మాణాలు
- మధ్యాహ్నం 3 - 5 వరకు అందుబాటులో అధికారులు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయాల ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం ఆయా ప్రాంతాల్లో ఏర్పాటుకు సర్వం సిద్ధం చేశారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో పాలన వికేంద్రీకరణ లక్ష్యంగా వార్డు కార్యాలయాల ఏర్పాటు చేయాలని పురపాలక శాఖ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ ఏరియాలో పలు ప్రాంతాల్లో వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రజలు నేరుగా తమ సమస్యలను వార్డు కార్యాలయంలో పరిష్కరించుకోడానికి వీలవుతుంది. గతంలో మాదిరిగా జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. అధికారులు కార్యాలయాల్లో ఎప్పుడు ఉంటారో తెలియక ప్రజలు అనేక వ్యయ ప్రయాసాలకు లోనవుతూ వచ్చారు. ఈ సమస్యలకు చెక్ పెట్టడానికి వీలుగా క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉండేలా సరికొత్త విధానానికి రూపకల్పన చేశారు. త్వరలోనే ఆయా డివిజన్లలో వార్డు కార్యాలయాలను ప్రారంభిచనున్నారు.

అధికారులు అందుబాటులో ఉండేలా..

నిర్దేశించిన సమయాల్లో అధికారులు తప్పనిసరిగా అందుబాటులో ఉంటూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించాల్సి ఉంటుంది. వార్డు కార్యాలయాల్లో పాలన విధానం ఏ విధంగా ఉండాలో నిర్దేశిస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. అందుకు అనుగుణంగా అధికారులు వార్డు కార్యాలయాలకు రూపకల్పన చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పారదర్శక పౌర సేవలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికగా వార్డు కార్యాలయాలు ఉండే విధంగా ఇప్పటికే జీహెచ్‌ఎంసీ అధికారులు కసరత్తు పూర్తిచేసినట్లు సమాచారం.

11 శాఖల అధికారులు..

సికింద్రాబాద్, బేగంపేట్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ పరిధిలో ప్రతి డివిజన్‌లో ఓ వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నారు. ప్రజలు నేరుగా ఈ వార్డు కార్యాలయానికి వచ్చి అధికారులను కలిసి తమ సమస్యలను పరిష్కరించుకోడానికి వెసులుబాటు ఉంటుంది. వార్డుల వారీగా ఏర్పాటు చేసే కార్యాలయాల్లో ఓ వార్డు ఆఫీసర్, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, పారిశుద్ధ్యం, యూసీడీ, వీధి దీపాలు, ఎంటమాలజీ, ఉద్యానం తదితర విభాగాల అధికారులతో పాటు జలమండలి, విద్యుత్ శాఖ అధికారులు కూడా ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఆయా విభాగాల అధికారులు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ప్రజలకు అందుబాటులో ఉంటారు. మొత్తం 11 మంది అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేలా విధానాలను రూపకల్పన చేశారు.

సమస్యల పరిష్కారానికి వేదికగా..

క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి వార్డు కార్యాలయాలు వేదికగా ఉంటాయని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి తెలిపారు. వార్డు కార్యాలయాల ఏర్పాటు చివరి దశకు వచ్చాయన్నారు. ఇటు అధికారులు, అటు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాటు చేస్తున్నామని వార్డు కార్యాలయాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వార్డు కార్యాలయాలు ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ఉపయుక్తంగా ఉంటాయన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సర్కిల్ కార్యాలయాలకు రావాల్సిన అవసరం ఉండదన్నారు. ప్రజలు జీహెచ్‌ఎంసీ ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఏ వార్డు కార్యాలయం ఎక్కడ..

- బన్సీలాల్‌పేట్ కార్యాలయం-గొల్లకొమురయ్య కాలనీ కమ్యూనిటీహాల్
- రాంగోపాల్‌పేట్ కార్యాలయం- చుట్టల బస్తీ కమ్యూనిటీహాల్
- మోండా మార్కెట్ కార్యాలయం-పర్కిబస్తీ/డొక్కలమ్మ దేవాలయం కమ్యూనిటీ హాల్
- బేగంపేట్ కార్యాలయం -పాటిగడ్డ మోడల్ మార్కెట్

ఫీజులపై పోరాటం



పెంచిన పీహెచ్‌డీ ఫీజును తగ్గించాలని ఆందోళన చేస్తున్న విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం పాలన భవనంలో జరుగుతున్న ఓయూ స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో ఫీజుల పెంపు అంశం పై మాట్లాడేందుకు ఏబీవీపీ, పీహెచ్‌డీ విద్యార్థులు ప్రయత్నించగా ప్రవేశ ద్వారం వద్ద పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో పోలీసులు సైతం కింపడ్డారు.

-ఉస్మానియా యూనివర్సిటీ

బీఆర్ఎస్ హయాంలో క్రీడలకు ప్రోత్సాహం



శిక్షణ పొందుతున్న విద్యార్థులతో గజ్జెల నాగేష్

రసూల్‌పురా: గ్రామీణ స్థాయి నుంచి విద్యార్థులు క్రీడల్లో రాణించేలా సీఎం కేసీఆర్ చర్యలు తీసుకుంటున్నారని రాష్ట్ర బెవరేజేస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్ అన్నారు. ఆత్మీయ పలకరింపు కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం మడ్‌ఫోర్ట్ హాకీ మైదానంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులతో సమావేశమయ్యారు. కంటోన్మెంట్ ప్రాంతం నుంచి ఎందరో క్రీడాకారులు జాతీయ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారని గుర్తు చేశారు. కంటోన్మెంట్‌లోని బొల్లారం, బోయిన్‌పల్లి, మడ్‌ఫోర్ట్ హాకీ మైదానంలో క్రీడాకారులకు వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం అందించేందుకు ఈ నెల 22 నుంచి సీఎం కప్ పేరుతో 18 విభాగాల్లో వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు దిలీప్, రామ్, లోకేష్, తేజ, నాయకులు రావుల సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలి



తార్నాకలో నిరసన తెలుపుతున్న సీపీఐ నేతలు

లాలాపేట: మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్న బ్రిజ్ భూషణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం తార్నాక చౌరస్తాలో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రేపిస్టులకు మోదీ ప్రభుత్వం అండగా ఉందని అందుకే బ్రిజ్ భూషణ్‌పై ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఆరోపించారు. బేటీ బచావో..బేటీ పడావో అంటూనే మరో వైపు బీజేపీ ఎంపీ మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి బ్రిజ్ భూషణ్ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసి పోక్స్ చట్టం క్రింద అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పావని, ఛాయాదేవి, కాంపల్లి శ్రీనివాస్, ఉమర్ ఖాన్, బాబు, రషీద్, సత్య, లెనిన్, పద్మ,రూప, మహాలక్ష్మీ,నారాయణ, అంజలి పాల్గొన్నారు.

అతివేగం.. ప్రమాదానికి కారణం

సనత్‌నగర్: అతివేగం ప్రమాదానికి కారణమని, నిర్దిష్ట వేగపరిమితితో వెళ్లడమే సురక్షితమని బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. అమీర్‌పేటలోని డాక్టర్ రెడ్డీస్ సెక్యూరిటీ సిబ్బందికి శనివారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. స్టాప్‌లైన్, ట్రిబుల్ రైడింగ్, ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు పాటించే విధి విధానాలను వివరించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్‌రూట్ ప్రయాణం చేయడంతో ఎంతోమంది ప్రాణాలను కోల్పోవడం, వికత జీవులుగా మారడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ట్రాఫిక్ నియమాలు పాటిస్తామంటూ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో టీటీఐ ఎస్ఐ జ్యోతి, చక్రధర్, ప్రసాద్, చిరంజీవి పాల్గొన్నారు.

బస్తీలో కార్పొరేటర్ పాదయాత్ర

రాంగోపాల్‌పేట్: రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ శనివారం డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. నల్లగుట్ట జే లైన్, జూలమ్మ బస్తీ తదితర ప్రాంతాల్లో నాలాలో పూడికతీత పనులను పరిశీలించారు. పూడికతీతలో నిర్లక్ష్యం వహించవద్దని, అడుగు భాగం నుంచి పూడికతీత తొలగిస్తేనే సమస్య పూర్తిగా పరిష్కారం అవుతోందన్నారు. డివిజన్‌లో మురుగునీటి సమస్యతో తాగునీరు కలుషితం అవుతుందని స్థానికులు ఆమె దృష్టికి తీసుకురాగా వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆమె జలమండలి మేనేజర్ సురేష్‌ను కోరారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి అక్కడి పిల్లలు, బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న పోషకాహారం గురించి అడిగి తెలుసుకున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

రాంగోపాల్‌పేట్: హుస్సేన్ సాగర్‌లో తేలియాడుతున్న ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని రాంగోపాల్‌పేట్ పోలీసులు వెలికితీశారు. ఎన్టీఆర్ మార్గ్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదురుగా హుస్సేన్ సాగర్ జలాల్లో మహిళ మృతదేహం తేలియాడుతుందన్న సమాచారం మేరకు పోలీసులు వెళ్లి వెలికితీశారు. మృతురాలి 50 – 55 వయస్సు ఉంటుందని పసుపు, ఆకుపచ్చ రంగు చీర, పసుపు రంగు జాకెట్ ధరించి ఉందని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించామని పోలీసులు తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు

అడ్డగుట్ట: అడ్డగుట్ట డివిజన్‌లో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మీ శ్రీనివాస్ అన్నారు. అడ్డగుట్ట ఏ-సెక్షన్‌లోని జీఎం అంజయ్య విగ్రహం వెనుక ప్రాంతంలో శనివారం రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన సివరేజీ పైపులైన్ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని రానున్న కాలంలో మరిన్ని అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు అధికారులతో చర్చిస్తున్నామన్నారు. డివిజన్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, జలమండలి డీజీఎం కృష్ణ, ఏఈ స్రవంతి, నాయకులు నక్కమధు, మనోహర్, సత్తయ్య గౌడ్, వసంత, రాజు, అమర్, ప్రవీణ్, మల్లేష్, మహ్మద్, నర్సింగ్, శ్రీరామ్ నాయక్, రవి పాల్గొన్నారు.

డ్రైనేజీ లైన్లపై దృష్టి సారించాలి



సనత్‌నగర్: గత పదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న సీవరేజీ లైన్ల నిర్మాణ పనులు పునః ప్రారంభించాలని బీజేపీ సీనియర్ నేత మర్రి శశిధర్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన జలమండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్‌బాబును కలిసి పలుచోట్ల సివరేజీ లైన్ల నిర్మాణ సమయంలో ఉత్పన్నమైన పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. గతంలో సనత్‌నగర్‌లో రూ.5 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని, అవి పూర్తిచేస్తే సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లతో పాటు జూబ్లీహిల్స్ ప్రాంతాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మర్రి శశిధర్‌రెడ్డి తెలిపారు. మొండా, రాంగోపాల్‌పేట డివిజన్లలో నీరు కలుషితం కాకుండా ఉండేలా పైప్‌లైన్ పనులు పూర్తి చేయాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో దయానంద్, షేక్‌గౌస్, అంబాల ఈశ్వర్‌బాబు, డి.విష్ణు, సురేందర్‌రెడ్డి, ఆకుల మహేష్, హృషీకేష్ ఉన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



సర్టిఫికెట్లతో విద్యార్థులు

పద్మారావునగర్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. భోలక్‌పూర్ క్రిష్ణానగర్ మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. టాలెంట్ స్ప్రీట్, గూగుల్ సంయుక్తాధ్వర్యంలో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కవిత, రాహుల్, రోహిత్‌లతో పాటు ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్ రెడ్డి మాట్లాడారు. విద్యాభివృద్ధి ద్వారానే పేదల జీవితాల్లో వెలుగు చూడగలమన్నారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా నిత్యం ఏదో ఓ పుస్తకం చదివే అలవాటును చేసుకోవాలన్నారు. ముఖ్యంగా మహనీయులు, మహానుభావుల జీవిత చరిత్ర పుస్తకాలను చదవాలని వారు జీవితంలో ఎలాంటి కష్టాలు, ఒడుదొడుగులను అధిక మించి తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకున్నారనే అనేక విషయాలు తెలుస్తాయన్నారు. విద్యార్థులు టీవీ, సెల్‌ఫోన్‌ను చూడటం చాలా వరకు తగ్గించాలన్నారు. జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలంటే మన ఆలోచన విధానాన్ని మార్చుకుంటూ ముందుకు సాగాలన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

మంత్రిని కలిసిన నూతన కమిటీ సభ్యులు



మంత్రి తలసానిని సన్మానించిన నూతన కమిటీ సభ్యులు

సనత్‌నగర్: క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారంలో కాలనీ సంక్షేమ సంఘాలు కీలకంగా వ్యవహరించాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ డివిజన్ పరిధిలోని సాయిబాబానగర్ నూతన కమిటీ సభ్యులు శనివారం కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డితో కలిసి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాలనీలు, బస్తీల వారీగా సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటి పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు స్థానికంగా నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. మంత్రిని కలిసిన వారిలో కొలను బాల్‌రెడ్డి, నరసయ్య, రాజారామ్, శ్రీనివాస్‌గౌడ్, సురేష్‌గౌడ్, దుర్గేష్ ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ..



రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీగణేశ్

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కందుల రవికుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో బోయిన్‌పల్లి సీఐ కోనేరు రవికుమార్ ఎస్‌బీ విభాగానికి బదిలీ కాగా, అయన స్థానంలో లాలాగూడ ఎస్‌హెచ్‌ఓగా ఉన్న కందుల రవికుమార్ నియమితులయ్యారు. శనివారం గత సీఐ రిలీవ్ అవుతూ, నూతన సీఐకి పదవీ బాధ్యతలు అప్పగించారు. నూతన సీఐ రవికుమార్‌ను తొలి రోజే పలువురు స్థానికులు కలిసి అభినందనలు తెలిపారు. బీఆర్ఎస్ సీనియర్ నేత శ్రీగణేశ్ పుష్పగుచ్ఛం అందజేశారు. రవికుమార్‌కు అంతర్జాతీయ హ్యాండ్ బాల్ క్రీడాకారుడిగా ప్రత్యేక గుర్తింపు ఉంది.

ఓయూ పీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా భాస్కర్



బాధ్యతలు స్వీకరిస్తున్న భాస్కర్

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ(ఇన్‌స్పెక్టర్)గా భాస్కర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల నగర వ్యాప్తంగా జరిగిన 96 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీలో నారాయణగూడ పీఎస్‌లో డీఐగా ఉన్న భాస్కర్ బదిలీపై ఓయూ పీఎస్‌కు వచ్చారు. సంగారెడ్డి జిల్లా జోగిపేటకు చెందిన ఆయన 2004 సివిల్ ఎస్సై బ్యాచ్‌తో పోలీసు విధుల్లో చేరారు. విజిలెన్స్‌లో కొంత కాలం పని చేసిన అనంతరం నారాయణగూడ పీఎస్‌లో డీఐగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. ఫ్రెండ్లీ పోలీసింగ్ దిశగా శాంతి భద్రతలను పరిరక్షిస్తామన్నారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న రమేష్ నాయక్ సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో భాస్కర్‌కు స్వాగతం, బదిలీపై వెళుతున్న రమేష్‌కు సిబ్బంది వీడ్కోలు పలికారు.



వీడ్కోలు సభలో కంటతడి..

ఉస్మానియా యూనివర్సిటీ: బదిలీ అయిన ఓయూ స్టేషన్ సీఐ రమేష్‌కు విద్యార్థులు, విద్యార్థి నాయకులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసిన సభలో సీఐ రమేష్‌నాయక్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడిన విద్యార్థి నాయకులతో పాటు సీఐ రమేష్‌నాయక్ కంటతడి పెట్టారు. ఓయూలోనే పీజీ చదివి డీఐ, సీఐగా ఇక్కడే ఉద్యోగం చేయడం ఆనందంగా ఉందని విద్యార్థిగా, పోలీసు అధికారిగా యూనివర్సిటీతో విడదీయరాని అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు.

ఆకలి తీర్చడం అభినందనీయం

సనత్‌నగర్: బీకేగూడ పార్కు వద్ద శ్రీనివాస సమాజ సేవా సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న మధ్యాహ్న మిత భోజనం శిబిరాన్ని ప్రముఖ డెంటల్ సర్జన్, డాక్టర్ ఓఎస్ రావు, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వరరావు సందర్శించి అభినందించారు. ఎండలు సైతం లెక్కచేయకుండా వయోధికులు సేవలు అందిస్తూ ఎందరో అన్నార్తుల ఆకలి తీర్చడం స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. నాగేశ్వరరావు తన జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమంలో భాగస్వామిగా నిలిచి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఆయనతో పాటు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి తన వివాహ మహోత్సవాన్ని పురస్కరించుకుని మిత భోజన కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. శ్రీనివాస సమాజ సేవా సమితి ట్రస్టీ పార్థసారధి మాట్లాడుతూ.. దంత వైద్య రంగంలో విశేష సేవలను అందించిన నాగేశ్వరరావు నేటి తరానికి ఆదర్శప్రాయుడన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనాథరెడ్డి, కసుమ భోగరాజు, తాడి వినయ్‌కుమార్, రామమూర్తి, విఠల్ రెడ్డి, కృష్ణారెడ్డి, పండరయ్య, అరవింద్‌గౌడ్, రజనిరెడ్డి పాల్గొన్నారు.